బోనస్ డబ్బులు ఇప్పించాలని ధర్నా

గూడూరు: మండలంలోని మట్టెవాడ శివారు కొంగరగిద్దకు చెందిన తునికాకు కూలీలు బుధవారం మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయం ఎదుట బోనస్ డబ్బుల కోసం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కూలీలు ఈసం రామక్క, ఐలబోయిన భాగ్యమ్మ, కోరం కౌసల్య మాట్లాడుతూ.. 2016లో మట్టెవాడ శివారు కొంగరగిద్ద గ్రామానికి చెందిన 100మందికి పైగా తునికాకు సేకరించి కల్లేదారులకు విక్రయించామన్నారు. అప్పుడు ప్రతీ కూలీకి బోనస్‌గా రూ.20వేల నుంచి రూ.30వేలు వస్తాయని ఫారెస్టు బీట్, సెక్షన్ ఆఫీసర్లు, కల్లేదారు చెప్పారన్నారు. దీంతో వెంటనే వారికి తమ బ్యాంకు అకౌంట్ ఖాతా జిరాక్స్‌లు అందించి పేర్లు నమోదు చేసుకున్నామన్నారు. కానీ ఇటీవల ఓ నెల రోజుల క్రితం గతంలో కూలీలుగా లేని వారి పేరుపై మాకు రావాల్సిన బోనస్ డబ్బులు సుమారు రూ.5లక్షలు వారి అకౌంట్‌లలో పడినట్లు, వారు ఆ డబ్బులు అప్పుడు పనిచేసిన కూలీలందరికీ ఇవ్వాల్సి ఉంది. కానీ మేము వారిని అడిగితే మా అకౌంట్‌లో పడిన డబ్బులు మీకేలా ఇస్తామంటూ ఇవ్వడంలేదని, ఫారెస్టు అధికారులను అడగమని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వారం రోజులుగా ఎఫ్ఆర్వో కార్యాలయం వచ్చి తమ బాధను చెప్పుకుంటున్నామని, ఐనా పట్టించుకోవడంలేదన్నారు. ఈవిషయమై తెల్సుకున్న ఎఫ్ఆర్వో గురువారం మీ గ్రామానికి ఫారెస్టు బీట్, సెక్షన్ అధికారులను పంపిస్తామని, అక్కడ అప్పటి కల్లేదారు ఎవరు, బీట్, సెక్షన్ ఆఫీసర్ ఎవరో తెల్సుకొని, మీ డబ్బులు వచ్చే ఏర్పాటు చేస్తామనడంతో కూలీలు వెనుతిరిగారు. ఇదేవిధంగా మండలంలోని భూపతిపేట పరిధిలోని కూలీలకు అన్యాయం జరిగిందంటూ మధ్యవర్తులు తమ డబ్బులు వారి అకౌంట్ వేయించుకున్నారని, దానికి అప్పటి ఫారెస్టు అధికారులు సహకరించి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ బోనస్ డబ్బులు తమకు ఇప్పించాలని, లేనిచో జిల్లా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.


బాధను చెప్పుకుంటున్న తునికాకు కూలీలు

కాంగ్రెస్‌తోనే పేదల కష్టాలు తీరుతాయి

గూడూరు: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే పేదలు కష్టాలు తీరుతాయని, కేసీఆర్ పాలనలో ప్రజలకు కష్టాలు తప్పవని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గూడూరు జీపీ పరిధిలోని కేశ్యతండా, భద్రుతండా, కలకత్తతండాలలో బుధవారం పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు ఇందిరమ్మ ఫలాలను వివరించారు. నాడు ఇందిరమ్మ, రాజీవ్, దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలోనే దేశ, రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వీరస్వామి, శంకర్‌గౌడ్, మధు గౌడ్, శివ పాల్గొన్నారు.

బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజల కష్టాలు పోతాయని పార్టీ నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయలక్ష్మి అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్‌లో భాగంగా బుధవారం మండలంలోని సత్యనారాయణపురం కాలనీ, బాలాజీపేట గ్రామాల్లో ఆమె పర్యటించారు. కార్యక్రమంలో కిషన్‌నాయక్, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, రవినాయక్, పంతులు, తదితరులు పాల్గొన్నారు.


గూడూరు: ప్రచారం చేస్తున్న మురళీనాయక్

హామీని విస్మరించిన ప్రభుత్వం

తొర్రూరు: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు మాలోతు సురేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. సురేష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరిస్తుందన్నారు. హరీశ్, నితిన్, సంజయ్, ప్రణయ్, చరణ్, సతీష్ పాల్గొన్నారు.


ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎస్టీఓకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

మరిపెడ: ఆల్ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదె అశోక్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని ఉప కోశాధికారి కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎస్‌టీఓకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త పెన్షన్‌ను రద్దు చేసి గతంలో అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కమిటీ గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, మదార్, వాల్యానాయక్, ప్రధాన కార్యదర్శి గొడిశాల వీరయ్య, కోశాధికారి కొమరయ్య, జిల్లా కార్యదర్శి వెంకన్న, మహిళా అధ్యక్షురాలు హేమలత పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

నెల్లికుదురు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 7న తెలంగాణ రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ హైదరాబాద్ హకీం పేటలోని స్పోర్ట్స్ పాఠశాలలో 2023–24 ప్రవేశాలకు ఎంపికలు చేయనున్నట్లు ఎంఈఓ గుగులోతు రాము బుధవారం 4వ తరగతి ప్రవేశాలకు 1-09-2014, 31-08-2015 మధ్య జన్మించిన బాల బాలికలు, 5వ తరగతి ప్రవేశాలకు 01-09-2013, 31-08-2014 మధ్య జన్మించిన బాల బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో బుధవారం పీడీ ఓ.జ్యోతి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ కోసం ఎంపిక పోటీలను నిర్వహించారు. 15మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొంటారు. కార్యక్రమంలో పీఈటీలు కాశీనాథ్, రవికుమార్, విజయ్‌చందర్, సునీల్, కమల్‌కిషోర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దోర్నకల్: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం మండలస్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదేళ్ల లోపు పిల్లలకు 9క్రీడలకు సంబంధించి క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ క్రీడల్లో 22మంది విద్యార్థులను గుర్తించినట్లు జెడ్పీహెచ్ఎస్ పీడీ శ్యాంబాబు తెలిపారు.


దోర్నకల్: జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కురవి: నాణ్యతా ప్రమాణాలు పాటించని మిరప నారు నర్సరీలపై చర్య తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం మండల కార్యదర్శి కర్నం రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలను పరిశీలించి నాణ్యతా పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, నిలుగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని అమనగల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని ఆమనగల్ గ్రామానికి చెందిన పొన్నెబోయిన రమేష్ (50) భార్య అలివేలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ మద్యానికి బానిసై తరచు కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుంటాడు. ఈక్రమంలో ఈ నెల 30వ తేదీ రాత్రి వారి ఇంటి ఆవరణలో పురుగుల మందు తాగి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబుతాడు. వారు వెంటనే ఆయను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

గార్ల: మండలంలోని పీక్లీతండాకు చెందిన సరోజపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం తెలిపారు. వివరాలిలావున్నాయి. ఈనెల 2వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సరోజ నేటి వరకు ఇంటికి రాలేదు. బంధువులు, చుట్టు ప్రక్కల గ్రామాల్లో వెతికినా సరోజ ఆచూకీ లభ్యం కాలేదు. 2 సంవత్సరాల క్రితం భార్య భర్తల మధ్యలు రావడంతో సంవత్సరం నుంచి సరోజ పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. ఈమేరకు తల్లి సోనా తన కూతురు కనిపించడం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉపాధి హామీలో అవకతవకలు

కొత్తగూడ: ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించారు. సిబ్బంది గుర్తించిన అంశాలపై ప్రజావేదిక సమీక్ష రెండోరోజు కొనసాగింది. ప్రతీ గ్రామ పంచాయతీలో 30వేలకుపైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఒక్కో సమస్యపై సిబ్బందిని నిలదీస్తూ అదనపు డీఆర్డీఓ గోవిందరాజు రికవరీ, పెనాల్టీ వేశారు. మండలం మొత్తంలో సిబ్బందిపై రూ.10,35,013 రికవరీ, రూ.95, 485 పెనాల్టి వేశారు. సిబ్బంది పనితీరుపై సామాజిక తనికీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ ఆదాం, ఎంపీడీఓ భారతి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

దంతాలపల్లి: మండలం దొనకొండ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనువాస్, శంకరయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు పాఠశాల పునఃప్రారంభం నుంచి విద్యార్థులకు వంట చేయడం లేదని వచ్చిన ఫిర్యాదుపై సర్పంచ్ ఉప్పలయ్య, వంట చేసే వారిని అడుగగా.. ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదని తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్ గ్రామసభలో తీర్మానం చేసి గ్రామ నిధులనుంచి వంట వారికి తగిన ఏర్పాట్లు చేస్తాం అని హామీ ఇవ్వడంతో తిరిగి మధ్యాహ్న వంట పనులను ప్రారంభించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నిక

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ రూరల్ మండల అధ్యక్షుడిగా మిట్టకంటి రాంరెడ్డి, అర్బన్ అధ్యక్షుడిగా ఘనపురపు అంజయ్యను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మండల అధ్యక్షుడిగా రఘువీర్‌రెడ్డి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పెండ్లి రఘువీర్‌రెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మండల అధ్యక్షుడిగా జగదీష్

డోర్నకల్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ముల్కలపల్లి గ్రామానికి చెందిన డీఎస్ జగదీష్, పట్టణ అధ్యక్షుడిగా కాలా సుమేర్‌చంద్‌జైన్ నియమితులయ్యారు.




అంజయ్య, మహబూబాబాద్ | రఘువీర్‌రెడ్డి, మరిపెడ రూరల్ | సతీష్, ఇనుగుర్తి

కేసముద్రం: కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కేసముద్రంస్టేషన్‌కి చెందిన అల్లం నాగేశ్వర్‌రావు, ఇనుగుర్తి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా కోమటిపల్లి గ్రామానికి చెందిన కూరెల్లి సతీష్ నియామకమైనట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.


నాగేశ్వర్‌రావు, కేసముద్రం

మానుకోట కృష్ణాకాలనీలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలోని 3తులాల పుస్తెలతాడు అపహరణ

మహబూబాబాద్ రూరల్: ఓ మహిళ మిల్లులో పిండి పట్టించుకొని ఇంటికి వెళ్తుండగా ఆమె మెడలోని 3తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకొనిపోయిన సంఘటన జిల్లా కేంద్రంలోని కృష్ణాకాలనీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీ ప్రాంతంలో నివాసం ఉండే జమున అనే మహిళ మిల్లులో పిండి పట్టించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. మార్గం మధ్యలో ఓ దుండగుడు ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వచ్చి మహిళ మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పారిపోయాడు. జమున సదరు దుండగుడితో ప్రతిఘటించినప్పటికి ఆ వ్యక్తి బలవంతంగా పుస్తెలతాడును లాక్కోవడం వల్ల ఆమె మెడపై గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే డీఎస్పీ రమణబాబు, టౌన్ సీఐ సతీష్, టౌన్ ఎస్సై దీపికరెడ్డి, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లోని పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు సమాచారం. కృష్ణ కాలనీలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలను అరికట్టాలని బాధితురాలు, కాలనీ వాసులు కోరారు. బాధితురాలు జమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై రామారావు తెలిపారు.


బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

విజయవంతం చేయాలి

గార్ల: ఖాజీపేటలో రైల్వే వ్యాగిన్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఘనత రాష్ట్రంలో బీజేపీ పార్టీకే దక్కనుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు వద్దిరాజు రామచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటే కేసీఆర్ ప్రభుత్వం, బీజేపీ పార్టీకి రాష్ట్రంలో ఎక్కడ క్రెడిట్ దక్కుతుందనే సాకుతో ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థలం అప్పగించ లేదని ఆయన విమర్శించారు. ఈనెల 8వ తేదీన ఖాజీపేటలో రైల్వే వ్యాగిన్ ఫ్యాక్టరీ ప్రధాని శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌కుమార్ జైన్, మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్ పాల్గొన్నారు.

కొత్తగూడ: ఈనెల 8న వరంగల్ పట్టణంలో జరిగే మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర పాలసీ కన్వీనర్ భుక్య రాజునాయక్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో మండలాల అధ్యక్షులు మునిందర్, వెంకన్న, నాయకులు మధు, మురళి, నవీన్ నాయక్, విజయ్, కొమ్మాలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు

మహబూబాబాద్: సివిల్ సప్లై కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సివిల్ సప్లై కార్యాలయంలో డీఎం కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు బాలకృష్ణ, ప్రదీప్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

తొర్రూరు రూరల్: జాతీయస్థాయి క్విజ్ పోటీలకు మండలంలోని నాంచారీమడూరు గ్రామ జయంతికాలనీకి చెందిన జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం రఘునందన్‌రావు గురువారం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులు ఈశాంత్, సాయిప్రియలను హెచ్ఎం రఘునందన్‌రావు, పీఈటీ వీరస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

హామీలను నెరవేర్చాలి

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వీఆర్ఏ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూగుంట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏ జేఏసీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కంభంపాటి సతీష్, ప్రతినిధులు రత్తయ్య, శిరీష, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

పోడు రైతులను దగా చేసిన ప్రభుత్వం

కొత్తగూడ: పోడు రైతులకు పూర్తిస్థాయిలో హక్కు పత్రాలు ఇవ్వకుండా దగా చేసిందని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2005 కంటే ముందు సాగులో ఉన్న భూముల అన్నింటికి హక్కు పత్రాలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. సమావేశంలో శ్రీశైలం, సురేందర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలి

గార్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతున్న గార్ల నిర్మలా హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాగం లోకేష్ లు బుధవారం డిమాండ్ చేశారు. గార్లకు వచ్చిన అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు.

సమ్మె నోటీస్ అందజేత

పెద్దవంగర: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. నేటి నుంచి నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొంటూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ సత్యనారాయణకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, పరశురాములు, మధూకర్, పాషా పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు రూ.10వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజితరవిచందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీశ్‌నాయక్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

దోర్నకల్: దోర్నకల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.ఉపేందర్‌రావును బుధవారం హన్మాతండా సర్పంచ్ దేవీశంకర్‌నాయక్‌తోపాటు పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది.

లిఫ్టులు మంజూరు

దోర్నకల్: దోర్నకల్ రైల్వే స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫాంలకు మూడు లిఫ్టులు మంజూరయ్యాయని డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్ బుధవారం తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

గూడూరు: ఇటీవల కొత్తగా పోడు పట్టాలు తీసుకున్న రైతులు రైతుబంధు కోసం వారి పట్టా, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలతో వచ్చి పేరు నమోదు చేసుకోవాలని ఏఓ అల్లె రాకేష్ బుధవారం తెలిపారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి

బయ్యారం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించకుండా ప్రభుత్వ అధికారులు నిఘా పెట్టాలని సీపీఎం జిల్లా నాయకులు మండా రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మధు, నాయకులు వెంకన్న, ఆనందరావు, శ్రీను, వెంకటయ్య, సెలార్ పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

తొర్రూరు: పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీఐ యంబాడి సత్యనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి మీరాజ్ పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బందికి బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు గండ్రాతి సతీష్, లింగారెడ్డి, రాంజీనాయక్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నాయకుల పూజలు

కురవి: ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌కు తిరిగి ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చాడని స్పష్టం కావడాన్ని హర్షిస్తూ ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్, ఉప సర్పంచ్ భరత్, తుకారంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

తొర్రూరు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వాసవి క్లబ్ కార్యదర్శి తమ్మి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం క్లబ్ ప్రతినిధులు మండలంలోని మాటేడు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సుమారు రూ.15వేల విలువ చేసే వస్తువులను అందించారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు



కురవి: మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్ వద్ద పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సాధనశూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంజి శ్రీను నేతృత్వంలో విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరశెట్టి మల్సూర్, ఎంపీటీసీ చిన్నంభాస్కర్, గూడూరు వీరన్న, ముల్క మురళీ పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపితే చర్యలు

నెల్లికుదురు: హెచ్ఐవీ బారిన పడిన బాధితుల శ్రేయస్సే లక్ష్యంగా ఆశాలు పనిచేయాలని సంపూర్ణ సురక్ష కేంద్ర జిల్లా మేనేజర్ రమేష్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి అన్వేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ బారిన పడిన బాధితులపై వివక్ష చూపితే వారిపై కఠినచర్యలతోపాటు లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్ష విధించ బడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు ఉన్నారా లేరా అనే కథనం గత గురువారం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన డీఆర్‌డీఓ సన్యాసయ్య మంగళవారం వసతిగృహం తనిఖీ చేశారు.

క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: ఆరోగ్య శ్రీలో వర్తించని వ్యాధుల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రూ.13,56,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 56మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు రవి, శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా చిరంజీవి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐగా చిరంజీవి బుధవారం విధుల్లో చేరారు. అనంతరం ఆయన జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ నాయక్‌ను డీపీఈఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీఎఫ్ ఎస్సైగా ఉన్న చిరంజీవికి సీఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు చిరంజీవిని మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సీఐగా బదిలీ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం



నెహ్రూసెంటర్: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని డిపో మేనేజర్ జె.విజయ్ అన్నారు. ఆర్టీసీ డిపోలో ప్రగతిచక్రం వార్షిక పురస్కారాలు పొందిన ఉద్యోగులను బుధవారం సన్మానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మానుకోట డిపోకు చెందిన కండక్టర్లు మల్లయ్య, ఎ.వెంకటేశ్వర్లు, డ్రైవర్లు రవి, రమేష్ ఆర్టీసీ ఎండి సజ్జనార్‌చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు జయప్రకాశ్, లక్ష్మయ్య, రుక్మిణి, షబ్బీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్టీల్ టేబుల్ బహూకరణ

గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వేమిశెట్టి వెంకటయ్య జ్ఞాపకార్థం దాత ఆయన కుమారుడు వేమిశెట్టి శ్రీనివాస్ కవిత దంపతులు రూ.10వేల విలువ గల స్టీల్ టేబుల్‌ను బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో వేమిశెట్టి సీతామహాలక్ష్మి, అనుప్రియ, శ్రావణి, మణికంఠ, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

'విగ్రహం ఏర్పాటు ప్రయత్నం మానుకోవాలి'

డోర్నకల్: ఖమ్మంలో శ్రీకృష్ణుడి రూపంలో తయారు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక అశోక్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన భారత యాదవ సమితి సమావేశంలో నాగేష్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల మనోభావాలను దెబ్బతీసేలా శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత యాదవ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్‌యాదవ్, నాయకులు హరికృష్ణ, నాని, నాగేశ్వర్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

పరిహారం పెంచాలి

కేసముద్రం: మూడో రైల్వేలైన్‌లో భాగంగా చేపట్టే భూసేకరణలో తమకు భూములకు తక్కువ పరిహారం లెక్కించడం సరైంది కాదని, వెంటనే పరిహారాన్ని పెంచి ఇవ్వాలంటూ కేసముద్రస్టేషన్, మహముద్‌పట్నం, జమలాపురం , ధన్నసరి గ్రామస్తులు బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ సాంబశివుడికి వినతి పత్రాన్ని అందజేశారు. భూమిని గుంటల్లో లెక్కించి ఎకరాకు రూ.8లక్షలు చెల్లించడం వలన తాము నష్టపోతామని, అదేవిధంగా ఇళ్లను కోల్పోతున్న వారికి సరైన పరిహారం అందించాలని పలువురు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం: జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం ధర్నా నిర్వహించారు. అదేవిధంగా ఇనుగుర్తి మండల కేంద్రంలో సర్పంచ్ దార్ల రామ్మూర్తి, కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు పరీక్ష యంత్రాల పంపిణీ

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల ప్రజావైద్యశాలలో బుధవారం అధునాతన రక్తపోటు పరీక్షల యంత్రాలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి చైతన్య తెలిపారు. వైద్యశాల పరిధిలో గల నర్సింహులపేట, దంతాలపల్లి ఉమ్మడి మండలాలలో 19మంది ఏఎన్ఎంలకు యంత్రాలను అందించినట్లు అమె తెలిపారు.